చెత్తపై.. చిత్త శుద్ధి ఏదీ?



సంగారెడ్డి పట్టణ వ్యాప్తంగా ఎక్కడపడితే అక్కడ చెత్త పేరుకుపోతోంది. ఓ వైపు డెంగీ డేంజర్ బెల్స్ మోగుతుంటే పారిశుధ్య నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కాలనీవాసులను అధికారులు చైతన్య పరిచే కార్యక్రమాలు నిర్వహించి చెత్తను ఎక్కడపడితే అక్కడ పారవేయకుండా చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు. సంగారెడ్డి అర్బన్:

శ్రావణ సందడి



కేతకీ సంగమేశ్వర ఆలయంలో శ్రావణ మాసం పూజలు చేశారు. చివరి శనివారం కావటంతో భక్తులు అధిక సంఖ్యలో తరలొచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ఆలయ ఆవరణలోని అమృత గుండంలో పవిత్ర పుణ్యస్నానాలు ఆచరించి, జలలింగానికి పూజలు చేశారు. అలాగే గర్భగుడిలోని పార్వతీ పరమేశ్వరులను క్యూలైన్ల ద్వారా దర్శించుకున్నారు. స్వామికి అభిషేకాలు, కూంకుమార్చన గావించారు. ఝరాసంగం(జహీరాబాద్):

అధ్వానంగా రోడ్డు



ఎస్సీ శ్మశానవాటిక రోడ్డు అధ్వానంగా మారింది. డివిజన్ పరిధిలోని చైతన్యనగర్ కాలనీకి చెందిన నర్సింహులు అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. దీంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అంత్యక్రియలకు కోసం చిన్నవాగు సమీపంలో ఉన్న శ్మశానవాటికకు మృతదేహాన్ని తీసుకొని వెళ్తుండగా బురదలో జారిపడి ఇద్దరు గాయపడ్డారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేశారు. పటాన్‌చెరు టౌన్:

క్లుప్తంగా

నాణ్యమైన భోజనం అందించాలి

జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి



విద్యార్థినులతో ధనలక్ష్మి

జోగిపేట(అందోల్): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి ధనలక్ష్మి సూచించారు. స్థానిక ఎస్సీ బాలికల వసతి గృహాన్ని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పరిసరాలను పరిశీలించి విద్యార్థులను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని చెప్పారు. వంట శాలలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, విద్యార్థులు వ్యాధులు బారిన పడకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు.

యువకుడి అదృశ్యం



హుస్సేన్

జహీరాబాద్: యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కాశీంపూర్ గ్రామ శివారులో గల ఫాంహౌస్‌లో అస్సాంకు చెందిన హలీం హుస్సేన్ కూలీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈనెల 25వ తేదీన ఉదయం 8 గంటలకు ఆస్పత్రికి వెళ్లి వస్తా అని చెప్పి తిరిగి రాలేదు. ఫాం హౌస్ సూపర్‌వైజర్ మోహన్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి : డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: వినాయక నవరాత్రి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ రవీందర్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ముదిరాజ్ భవనంలో శనివారం సాయంత్రం వినాయక మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులతో కలిసి పీస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీఎస్పీ, సీఐ ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ.. సబ్ డివిజన్ పరిధిలోని ఏడు పోలీస్‌స్టేషన్ పరిధిలో గణేష్ మండపాల ఏర్పాటు చేసే నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం మండపాల నిర్వాహకులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ఆసిఫ్అలీ, జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేష్, అగ్నిమాపక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన రైతులకు 'మాఫీ'

ఝరాసంగం(జహీరాబాద్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ అర్హులైన ప్రతీ ఒక్కరికి వర్తిస్తుందని జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని ఈదులపల్లి, మెదపల్లి, గినియార్ పల్లి గ్రామాల్లో కొనసాగుతున్న రైతు కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలించారు. అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపజేసేందుకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఓ వెంకటేశ్వర్, ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శంకర్ పాటిల్, ఏఈఓ రేణుక, నాయకులు రవి పాటిల్, సిద్దయ్య స్వామి, మల్లన్న పాటిల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కిరాణా దుకాణం దగ్ధం

నారాయణఖేడ్: విద్యుదాఘాతంతో కిరాణా దుకాణం దగ్ధమైన ఘటన నారాయణఖేడ్ మండలం పైడిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. పైడిపల్లి గ్రామానికి చెందిన పెద్దగొల్ల శంకర్ తన ఇంట్లోనే కిరాణా దుకాణాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. రోజులాగే శుక్రవారం రాత్రి దుకాణం మూసి కుటుంబీకులతో పాటు భోజనం చేసి నిద్రించాడు. అర్ధరాత్రి దుకాణం నుంచి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. వెంటనే కుటుంబీకులు, చుట్టుపక్కల వారు మంటలార్పివేశారు. రూ.2 లక్షల నష్టం జరిగి ఉపాధిని కోల్పోయానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

ఆకట్టుకుంటున్న చేనేత కళా



సంగారెడ్డి : జిల్లా కేంద్రమైన సంగారెడ్డి చేనేత హస్త కళా మేళా శనివారం ప్రారంభమైంది. పట్టణంలోని టీటీడీలో ఏర్పాటు చేసిన ఈ మేళా ఆకట్టుకుంటోంది. ఇందులో పోచంపల్లి నారాయణపేట, గద్వాల, వరంగల్, ఉప్పాడ, సిద్దిపేట, వెంకటగిరి చీరలు, కంచి, ధర్మవరం, కాటన్ చీరలు, చేనేత కాటన్, పట్టు వస్త్రాలు, డ్రెస్ మెటీరియల్స్, టవల్స్, కాటన్ ప్రింటెడ్ చీరలు, దుప్పట్లు, కర్టెన్లు, భారీ మెటీరియల్స్ అందుబాటులో ఉన్నాయి. హస్త కళ వస్తువులైన కొండపల్లి, ఏటికొప్పాక, నిర్మల్ బొమ్మలు, మైసూర్ రోజ్వుడ్ వస్తువులు, వరంగల్ లెదర్స్, బంజారా ఎంబ్రాయిడరీ హైదరాబాద్ పెరల్స్, హైదరాబాద్ బ్యాంగిల్స్, చెక్క వస్తువులు, బ్లాక్ మెటల్స్, పెంబర్తి, ఇత్తడి వస్తువులను నిర్వాహకులు అందుబాటులో ఉంచారు. అయితే మేళాను చూసేందుకు ప్రజలు తరలిరావడంతో కిటకిటలాడు తోంది. నెలరోజులపాటు ఈ మేళా కొనసాగుతుందన్నారు.



హస్త కళా మేళాలో ప్రదర్శించిన వస్తువులు

హైడ్రాను ఆహ్వానిస్తున్నాం

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజు

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : రాష్ట్రంలో చెరువులు, నాలాలు, జలవనరుల సంరక్షణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రా వ్యవస్థ ఆహ్వానించదగ్గ విషయమని జయరాజు అన్నారు. శనివారం సంగారెడ్డిలో సీపీఎం నాయకులు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెరువులు, నాలాల్లో ఉన్న నిర్మాణాలను తొలగిస్తున్న సందర్భంగా పేదలు, మధ్య తరగతి ప్రజానీకం దీనికి సమిధలు కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సంగారెడ్డి పట్టణంతో పాటు పటాన్‌చెరు, అమీన్‌పూర్‌లలో పేదలు అనేక ఏళ్ల నుంచి ఇళ్లు కట్టుకొని ఉన్నారని, ఆ ఇళ్లను ఆక్రమణల పేరుతో నోటీసులు ఇచ్చి భయాందోళనలకు గురి చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో చెరువులు, నాలాల పక్కన ఆక్రమణలు, ఎఫ్ఎల్, బఫర్ జోన్ల పేరుతో ప్రత్యామ్నాయం చూపకుండా పేదలు, మధ్యతరగతి వారిని బజారుపాలు చేయొద్దని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాణిక్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

● ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్

సంగారెడ్డి : రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సూచించారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. జిల్లాకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసిన దృష్ట్యా అన్ని శాఖల అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని కోరారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో, మట్టి మిద్దెల్లో నివసించే వారు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎక్కడా కూడా ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవించకుండా ముందస్తుగా చర్యలు చేపట్టాలన్నారు. చెరువులు, వాగులు, కుంటల్లోకి వచ్చి చేరుతున్న వరద ప్రవాహాన్ని అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్: సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే కె.మాణిక్‌రావు అందజేశారు. శనివారం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులకు వీటిని అందజేశారు. న్యాల్‌కల్ మండలం మెటల్‌కుంటకు చెందిన సంజీవరెడ్డికి రూ.38వేలు, ఝరాసంగం మండలం గుంతమర్పల్లికి చెందిన నవీన్‌కు రూ.29వేల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు రాజేందర్‌రెడ్డి, వెంకటేశం, నర్సింహాగౌడ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రహరీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తదితరులు

పటాన్‌చెరు: ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం డివిజన్ పరిధిలోని బండ్లగూడలో రూ.1 కోటి 30 లక్షలతో చేపట్టనున్న హిందూ, ముస్లిం, క్రైస్తవ శ్మశాన వాటికలకు ప్రహరీ నిర్మాణ పనులకు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ప్రభుత్వం హయాంలో శ్మశానవాటిక, ప్రహరీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు అయ్యాయని గుర్తుచేశారు. అభివృద్ధి పనులు చేపట్టే క్రమంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు ఆలస్యం అయ్యాయని గుర్తు చేశారు.

సమాజంలో అందరూ సమానం



మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్ చక్రవర్తి

కల్హేర్(నారాయణఖేడ్): సమాజంలో అందరూ సమానత్వం పాటించాలని నారాయణఖేడ్ ఆర్డీఓ అశోక్ చక్రవర్తి సూచించారు. శనివారం మండలంలోని బీబీపేట ఎస్ ఎస్సీ కాలనీలో సివిల్ రైట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు అందరూ కలిసి ఉండాలని కోరారు. ఎవరైనా కుల వివక్షత పాటిస్తే అధికారుల దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శివ శ్రీనివాస్, ఆర్ఐ మల్లేశం, కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు సాయిలు తదితరులు పాల్గొన్నారు.

హిజ్రాల సంక్షేమం కోసం కృషి



మాట్లాడుతున్న రాధాకృష్ణ చౌహాన్

సంగారెడ్డి టౌన్: హిజ్రాల సంక్షేమం కోసం కృషి చేస్తామని జిల్లా లీగల్ అథారిటీ ఇన్‌చార్జి కార్యదర్శి రాధాకృష్ణ చౌహాన్ అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ట్రాన్స్, హిజ్రా, సెక్స్ వర్కర్లతో సంగ్రామ్ సంస్థ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చౌహాన్ మాట్లాడుతూ.. శాంతి భద్రత విధి విధానాల్లో విద్య ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సెక్స్ వర్కర్ల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా శాంతియుత సమాజాన్ని నిర్మించేందుకు న్యాయవాదులు, సంఘం నాయకులు సహాయం చేయాలన్నారు. అదనపు పోలీస్ సూపరింటెండెంట్ సంజీవరావు, లలిత పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఓటరుగా పేరు నమోదు చేసుకోవాలి**

సంగారెడ్డి టౌన్ : 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా తమ పేరు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో యాదగిరి అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో బూత్ స్థాయి అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి బీఎల్ఓ యాప్‌లో ఓటర్ల వివరాలను నమోదు చేయాలన్నారు. ఓటర్ జాబితాలో పేరు లేకపోయినా, మరణించిన వారి పేర్లను తొలగించి పొరపాట్లను సరిదిద్దాలన్నారు.

◆ **రసాయన పరిశ్రమను మూసివేయాలి యువకుడి పాదయాత్ర**

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): మండల పరిధిలోని ఆరూర్ గ్రామ శివారులోని ఎవరెస్టు రసాయన పరిశ్రమను మూసివేయాలని డిమాండ్ చేస్తూ కోనాపూర్ గ్రామానికి చెందిన కన్న సాయి శనివారం పరిశ్రమ నుంచి హైదరాబాద్‌లోని పీసీబీ కార్యాలయం వరకు పాదయాత్ర చేపట్టాడు. ఈ పాదయాత్రకు డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అనిల్ సంపూర్ణ మద్దతు ప్రకటించి సంఘీభావం తెలిపారు. జల, వాయు కాలుష్యంతో ప్రజలు ప్రాణాలతో చెలగాటమాడుతున్న పరిశ్రమను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యానికి తొత్తుగా మారిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

◆ **డీహెచ్‌పీఎస్ నూతన కమిటీ**

నారాయణఖేడ్: దళిత హక్కుల పోరాట సంఘం జిల్లా నూతన కమిటీని నారాయణఖేడ్‌లో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నాగల్‌గిద్ద గణపతి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.ఆనంద్‌లు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా పుప్పాల అశోక్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనిల్ వ్యవహరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ.. జిల్లాలో అట్టడుగు ప్రజల సమస్యలపై కమిటీ పనిచేస్తుందని అన్నారు.

◆ **నేటి నుంచి భవానీమాత దీక్షలు**

నారాయణఖేడ్: జగదాంబ భవానీమాత 41 రోజుల మాలా దీక్షాధారణ కార్యక్రమాన్ని ఆదివారం నుంచి నిర్వహించనున్నట్లు బంజారా సేవాలాల్‌సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ చౌహాన్ తెలిపారు. సంఘం నాయకులు నెహ్రూనాయక్, కిషన్‌రాథోడ్, లక్ష్మణ్ చౌహాన్, మోహన్‌నాయక్, రాజునాయక్, ప్రేమ్‌సింగ్, సర్దార్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **శనిత్రయోదశి పూజలు**



ఝరాసంగం(జహీరాబాద్): బర్దిపూర్ దత్తగిరి మహారాజ్ ఆశ్రమ ఆవరణలోని శనీశ్వరుడికి శనిత్రయోదశి పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. శనివారం ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, డాక్టర్ సిద్దేశ్వరస్వామీల ఆధ్వర్యంలో నిత్య పూజలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శని త్రయోదశిని పురస్కరించుకొని ఉదయం సుప్రభాత సేవ, విగ్రహానికి తైలాభిషేకం, అభిషేకం తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. శ్రావణమాసం పురస్కరించుకొని జ్యోతిర్లింగాల వద్ద లక్ష బిల్వార్చన గావించారు. కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, అర్చకులు, వైదిక పాఠశాల విద్యార్థులు, వివిధ ప్రాంతాల భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ **నిరసన**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): గుంతల రోడ్డులో ఎలా ప్రయాణించాలంటూ తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్ ముప్పా ఇంద్రప్రస్త వాసులు శనివారం రోడ్డుపై వర్షంలో నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీ నుంచి ఉస్మాన్‌నగర్ రేడియల్ రోడ్డుకు వెళ్లే మార్గం ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు స్పందించి తమ సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

◆ **ప్రత్యేక అలంకరణలో రామలింగేశ్వరుడు**

పటాన్‌చెరు టౌన్: పట్టణంలోని టోల్‌గేట్ సమీపంలో రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం శని త్రయోదశి నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నీశ్వరునికి తైలాభిషేకాలు, రామలింగేశ్వర స్వామి వారికి అభిషేకాలు నిర్వహించారు. స్వామి వారిని పెరుగు అన్నంతో ప్రత్యేకంగా అలంకరించారు. అలాగే దేవస్థానంలోని ఆంజనేయ స్వామి వారికి సింధూర పూజ నిర్వహించారు.

◆ **ఘనంగా అష్టమ వార్షికోత్సవం**

మునిపల్లి(అందోల్): అష్టమ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని బుదేరా శివారు వేంకటేశ్వర స్వామికి భక్తులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఉదయం నుంచి పంచామృత అభిషేకం, చండీ హోమం చేశారు. ఆలయ ధర్మకర్త లక్ష్మారెడ్డి, రాజ్యలక్ష్మి, సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించినట్లు పూజారి రాజ్‌పంతులు తెలిపారు.

◆ **పేదలకు అండగా సీఎం సహాయనిధి**

జోగిపేట(అందోల్): సీఎం సహాయనిధి పేదలకు కొండంత అండగా ఉంటుందని అందోలు-జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు అన్నారు. శనివారం జి.భాగ్యమ్మకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్‌ను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో 42మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని విడుదల చేసినట్లు తెలిపారు.

◆ **పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలి**



సంగారెడ్డి ఎడ్యుకేషన్ : ఉద్యోగుల పాలిట శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయిలు డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిలోని పలు పాఠశాలలను సందర్శించి విద్రోహ దినం సందర్భంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1 పెన్షన్ విద్రోహ దినం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఐబీ వద్ద తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ ఐక్యవేదిక పిలుపు మేరకు నిరసన ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ జిల్లా కమిటీ సభ్యులు ఎం.సుచరిత, ఎం.విజయలక్ష్మి నాయకులు సూర్యనారాయణ శర్మ, బీ. కమలాకర్ రావు, వీణాదరి, సంధ్యారాణి, తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆగని వర్షం పంటకు నష్టం**

రాయికోడ్(అందోల్): వారం రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో 90 శాతం మంది రైతులు సుమారు 35వేల ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నారు. పూత, కాతదశలో ఉన్న పంట ఈ వర్షాల వల్ల దెబ్బతింటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు ఇలాగే కొనసాగితే కాయలు కుళ్లిపోయి దిగుబడి పడిపోతుందని వాపోతున్నారు.

◆ **వరద కాలువల పరిశీలన**

జహీరాబాద్: పట్టణంలో శనివారం తెల్లవారుజామున భారీ వర్షం కురిసింది. ఉదయం మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాస్‌రెడ్డి లోతట్టు ప్రాంతాలను సందర్శించి పరిశీలించారు. ప్రధానంగా వరద కాలువల్లో నీరు సాఫీగా పారుతుందో లేదోనని పర్యవేక్షించారు. వరద ఇబ్బందుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సిబ్బంది నిర్వహిస్తున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సంధ్య పాల్గొన్నారు.

◆ **గడువు పొడిగింపు**

సంగారెడ్డి ఎడ్యుకేషన్ : 2024-25 సంవత్సరానికి ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కీం)కు ఎంపికైన అభ్యర్థులు, రెన్యూవల్ అభ్యర్థులు నేషనల్ స్కాలర్ షిప్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 30వ తేదీ వరకు గుడువు పొడగించినట్లు జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ దరఖాస్తులకు సంబంధించి ప్రధానోపాధ్యాయులు అక్టోబర్ 15వ తేదీలోపు పోర్టల్‌లో వెరిఫికేషన్ చేయాలని సూచించారు.

◆ **రేపు కుంకుమార్చన మహోత్సవం**

నారాయణఖేడ్: పట్టణంలోని దత్తాత్రేయ మందిరంలో శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకొని సోమవారం సాయంత్రం 5 గంటల నుంచి ఉమాపార్థివ లింగార్చన సహిత కుంకుమార్చన మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ బాధ్యులు తెలిపారు.

◆ **నూతన నియామకం**

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్ఈఎల్ ఎస్సీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికల శనివారం బెల్ కమ్యూనిటీ సెంటర్‌లో నిర్వహించారు. ఎన్నికల ఫలితాలను సాయంత్రం ప్రకటించారు. అధ్యక్షుడిగా సురేందర్, ప్రధాన కార్యదర్శిగా దేవా అర్జున్ విజయం సాధించారు.